నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | శుక్రవారం 28 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# జీతాల్లేవు.. బతుకుడెట్లా.?

## సిర్పూర్(టీ) జీపీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికుల నిరసన



సిర్పూర్ (టీ) గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

కౌటాల, మార్చి 27 : 'అసలే చాలీ చాలని వేతనాలు.. 14 నెలలుగా ఇస్తలేరు. మేమంతా బతుకుడెట్లా.. పూట గడవడం దినదిన గండంగా మారింది. వేతనాలు వెంటనే విడుదల చేయాలి' అంటూ పారిశుధ్య కార్మికులు (ఎన్ఎంఆర్) డిమాండ్ చేశారు. గురువారం సిర్పూర్(టీ) మేజర్ జీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సిర్పూర్ పంచాయతీలో 12 మంది పారిశుధ్య కార్మికులం పనిచేస్తున్నామని, 14 నెలలుగా జీతాలు రాక కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నామని, తమ గోస పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ఇందుకు ఈవో తిరుపతి స్పందిస్తూ బిల్లులు పంపానని, బడ్జెట్ లేదని, ఓ రెండు రోజులు ఓపిక పట్టండని, ఉన్నతాధికారులతో మాట్లాడి జీతాలు వచ్చేలా చూస్తానని ఆయన తెలపడంతో కార్మికులు ఆందోళన విరమించారు.



ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేస్తున్న మాజీ సర్పంచ్‌లు

# అప్పులు తెచ్చి అభివృద్ధి చేసినం

## పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలి

- పలు గ్రామాల మాజీ సర్పంచుల డిమాండ్
- కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసి నిరసన

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ కాగజ్‌నగర్, మార్చి 27 : 'వడ్డీకి అప్పులు తెచ్చి.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. అప్పులిచ్చినోళ్లు అడుగుతుంటే ఊర్లో తిరుగలేకపోతున్నాం. వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి' అంటూ ఆయా గ్రామాల మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కాగజ్‌నగర్ మండలంలో 28 గ్రామ పంచాయతీలుండగా, సుమారు 20 గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ. 3 నుంచి రూ. 4 కోట్ల వరకు బిల్లులు వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పనులు జరిగాయి. మన ఊరు-మన బడి, అంతర్గత రహదారులు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికల నిర్మాణం తదితర పనులు చేపట్టగా, అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లింపు చేస్తున్న క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. సర్పంచుల పదవీ కాలం కూడా ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక్క బిల్లు కూడా విడుదల చేయలేదని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సర్కారు స్పందించి సత్వరమే బిల్లులు విడుదల చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

### అప్పల బాధకు ఊరిలో తిరుగలేకపోతున్నాం



మా గ్రామ పంచాయతీలో రూ. 35 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం. సుమారు ఏడాదిన్నర వుతోంది. కాంగ్రెస్ సర్కారు వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఒక్క బిల్లు కూడా మంజూరు కాలే. కాంగ్రెసోళ్లు మా బాధలను పట్టించుకుంటలేరు. అప్పులిచ్చిన వాళ్లు అడుగుతున్నారు. తలెత్తుకొని తిరగలేక పోతున్నాం. ఇకనైనా పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి.

**- మెస్రం ఉమా, బట్‌పల్లి, మాజీ సర్పంచ్**




### అప్పలోళ్లకు ఎట్లా కట్టాలే

మా గ్రామ పంచాయతీలో శ్మశాన వాటిక, డంప్ యార్డు, పార్కు, పల్లె ప్రకృతి వనం, సీసీ, గ్రావెల్ రోడ్లు నిర్మించాం. స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేసి బోర్లకు మరమ్మతులు చేయించాం. ఇలా అనేక అభివృద్ధి పనుల చేశాం. ఇందుకోసం సుమారు రూ. 9 లక్షల దాకా అప్పు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క బిల్లుకూడా రాలే. అప్పులోళ్ల బాధలు ఎక్కువైనయి. వాళ్లకు నేను ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలే. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి బిల్లులు మంజూరు చేయాలే. లేదంటే నిరసనలు తీవ్రం చేస్తాం. **- మేకార్తి గంగన్న, అందవెల్లి, మాజీ సర్పంచ్**

# ఊరించి ఉసూరుమనిపిస్తే!?

## మంత్రి పదవిపై జిల్లా నాయకుల గంపెడాశలు

- ముందు నుంచి పార్టీని పట్టుకొని ఉన్నవారికా..?
- ఎన్నికల ముందు పార్టీలో చేరిన నాయకులకా..?
- ప్రాధాన్యం తగ్గితే గతంలోనే పార్టీపై తిరుగుబావుటా ఎగరేస్తానన్న ఓ ఎమ్మెల్యే
- మంత్రి పదవి విషయంలో తగ్గేదేలే అంటున్న ఎమ్మెల్యేలు
- మా సార్‌కే వస్తుందంటే.. లేదు.. మా సార్‌కేనంటూ ప్రచారం
- మంచిర్యాల జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన మంత్రివర్గ విస్తరణ




మంచిర్యాల, మార్చి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంత్రివర్గ విస్తరణ అంశం ఇప్పుడు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీని కుదిపేస్తున్నది. మా సార్‌కే మంత్రి పదవి వస్తుందంటే.. లేదు.. మా సార్‌కే వస్తుందంటూ ఏ వర్గం ఎమ్మెల్యే అనుచరులు.. ఆ ఎమ్మెల్యే పేరు ప్రచారం చేస్తున్నారు. ఏడాదిన్నరగా ఊరిస్తున్న మంత్రివర్గ విస్తరణ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంత్రివర్గ విస్తరణ చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో ఆరుగురికి మంత్రి పదవులు ఇస్తారని.. వీటిలో నాలుగు ఇప్పటికే ఫైనల్ అయిపోయాయని చెబుతున్నారు. మరో రెండు మంత్రి పదవులు ఎవరికి ఇస్తారు. హోల్డ్‌లో పెడతారా.. లేకపోతే వాటినీ భర్తీ చేస్తారా.. భర్తీ చేస్తే ఎవరికి మంత్రి పదవి వస్తుందన్న విషయంలో ఊహాగానాలు అధికమైపోయాయి. మంచిర్యాల జిల్లా నుంచి చెన్నూర్ ఎమ్మెల్యే పేరు దాదాపు ఖాయమైపోయినట్లు చెబుతున్నారు. అదే జరిగితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముందు నుంచి హస్తం పార్టీని పట్టుకొనే ఉన్నా మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్, ఆయన అనుచరుల భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికీ మా సార్‌కే మంత్రి పదవి వస్తుందంటూ మంచిర్యాల ఎమ్మెల్యే అనుచరులు చెప్పుకొస్తున్నారు. మరోవైపు మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఖరారైపోయిందని వివేక్ వర్గం చెప్పుకుంటుంది. ఇకపోతే బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ సైతం ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేను కలుసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో మంచిర్యాల జిల్లాలో అధికార పార్టీకి సంబంధించి ముగ్గురు ఎమ్మెల్యేలు సైతం మంత్రి పదవి రేస్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతున్నది.

### జిల్లా కాంగ్రెస్‌లో తిరుగుబాటు తప్పదా..?

మంత్రి పదవి విషయంలో ఏ మాత్రం అటూ.. ఇటైనా మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి తిరుగుబాటు తప్పేలా లేదు. ఇటు పీఎస్సార్‌కు.. అటు గడ్డం బ్రదర్స్‌లో ఒక్కరికి ఇస్తే జిల్లాకు రెండు మంత్రి పదవులు ఇవ్వాల్సిందే. లేదా అసలు జిల్లాలో ఎవరికి మంత్రి పదవి ఇవ్వకున్నా పర్లేదు. ఒకరికి ఇచ్చి మరొకరికి ఇవ్వకపోతే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏమిటన్నది ఊహించుకోలేమని ఆ పార్టీ నాయకులే చెప్పడం గమనార్హం. ఒకవేళ వివేక్‌కు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన పీఎస్సార్‌కు అన్యాయం చేసినట్లే అవుతుంది. గతంలో పీసీసీ అధ్యక్ష పదవి విషయంలో పార్టీ వ్యవహార శైలిపై ఆయన బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితులు మారకపోతే ఇందిరా కాంగ్రెస్ పార్టీ పెడతానంటూ ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. అదయ్యాక రేవంత్ ఇంద్రవెల్లి పర్యటనతో పార్టీలో కొంత సయోధ్య కుదిరింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తానే మినిస్టర్ అవుతాననే ధీమాలో ఉన్నారు. మరోవైపు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు అత్యంత సన్నిహితుడిగా పీఎస్సార్‌కు పేరు ఉంది. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగినా కచ్చితంగా పదవి వస్తుందంటూ అధిష్టానం నుంచి సైతం చెప్పారనే టాక్ అప్పట్లో వినిపించింది. గతంలో భట్టి పెద్దపల్లి జిల్లా పర్యటన సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పీఎస్సార్ సేవలను పార్టీ గుర్తించిందని, ఆయన నాయకత్వంపై విశ్వాసం ఉందని చెప్పారు. దీంతో మంత్రి పదవి పీఎస్సార్‌కే అంటూ అప్పట్లో వార్తలు వచ్చాయి. కానీ, తాజా పరిణామాల నేపథ్యంలో సమీకరణలు మారి వివేక్‌కు పదవి వస్తే పీఎస్సార్ భవితవ్యం ఏమిటి.. అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చి బుజ్జగించాలని చూస్తున్నట్లు సైతం చర్చ నడుస్తున్నది. కానీ, దానికి ససేమిరా అంటున్నట్లు తెలుస్తుంది. ప్రాధాన్యత తగ్గితే ఊరుకునే పరిస్థితి కనిపించడం లేదు. వివేక్‌కే మంత్రి పదవి ఇస్తే జిల్లా కాంగ్రెస్ పార్టీలో అది పెద్ద కుదుపు తీసుకువచ్చే ఛాన్స్ ఉంది. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై విభిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు సమర్థిస్తున్నప్పటికీ.. ఎన్నికలకు ముందే పార్టీలోకి వచ్చిన ఆయనకు పదవి ఇస్తే మాత్రం ఊరుకునేది లేదని మరో ఎమ్మెల్యే వర్గం స్పష్టం చేస్తున్నది. ఒకవేళ ఎస్సీలకు పదవి ఇవ్వాలనుకుంటే మాల సామాజిక వర్గానికి చెందిన భట్టి విక్రమార్క ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్న నేపథ్యంలో.. మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వాలనే డిమాండ్ సైతం వినిపిస్తున్నది. కానీ, ఢిల్లీ స్థాయిలో మంత్రి పదవి కోసం పైరవీలు నడుస్తున్నాయని, గతంలో ఇచ్చిన హామీ నేపథ్యంలో తప్పకుండా వస్తుందని ప్రచారం చేస్తున్నారు.

### సీఎంకు ఒకరిపై కోపం.. మరొకరిపై ప్రేమ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడి బాధ్యతలు ఇవ్వడాన్ని పీఎస్సార్ వ్యతిరేకించారు. ఆ కోపం పీఎస్సార్‌పై ఇంకా సీఎంకు ఉందనే చర్చ జిల్లాలో నడుస్తున్నది. అందుకే పీఎస్సార్‌కు ప్రత్యామ్నాయంగా వివేక్‌ను మంచిర్యాల జిల్లాలో ప్రోత్సాహిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సహా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏ మీటింగ్‌కు వచ్చినా సీఎం రేవంత్‌రెడ్డి కాక కుటుంబాన్ని ప్రశంసిస్తూ మాట్లాడానికి ఇదే కారణమని తెలుస్తున్నది. ఇన్ని రోజులు మాల సామాజిక వర్గాన్ని అసలు పట్టించుకోని వివేక్‌కు ఒక్కసారిగా ఆ సామాజిక వర్గంపై ప్రేమ పుట్టుకురావడానికి వెనుక సైతం సీఎం, పార్టీ పెద్దల హస్తం ఉందనే ప్రచారం ఇప్పుడు నడుస్తున్నది. పథకం ప్రకారం వివేక్‌ను అధిష్ఠానం ముందు బలంగా చూపించడంలో భాగంగానే రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేయించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే పీఎస్సార్ మంత్రి పదవి ఆశలు గల్లంతైనట్లేనని పలువరు విశ్లేషిస్తున్నారు.

### ఎవరికి ఇచ్చినా కష్టమే..

ముందు నుయ్యి.. వెనక గొయ్యి అన్నట్లు ఉంది మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి. మంత్రి పదవి విషయంలో ఎమ్మెల్యేల మధ్య పోటీ తలనొప్పిగా మారింది. ఇద్దరిలో ఎవరికి మంత్రి పదవి ఇచ్చినా జిల్లా కాంగ్రెస్‌లో క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. పార్టీ వ్యవహారాల విషయంలో అటు పీఎస్సార్‌కు.. ఇటు వివేక్‌కు పొసగకపోవచ్చు. డీసీసీ అధ్యక్షురాలిగా పీఎస్సార్ భార్య సురేఖ ఉన్నారు. స్థానికసంస్థల ఎన్నికలు దగ్గర్లో ఉన్నాయి. ఒకవేళ వివేక్‌కు మంత్రి పదవి వస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు కేటాయించే విషయంలో పీఎస్సార్ కాంప్రమేజ్ కాకపోవచ్చు. ముందు నుంచి పార్టీలో ఉన్న వారికే ప్రాధాన్యం ఇస్తే వివేక్‌ను నమ్ముకొని పార్టీలో చేరిన వారికి ఇబ్బందులు తప్పవు. ఒకవేళ పీఎస్సార్‌కు మంత్రి పదవి వస్తే వివేక్ వర్గం మొత్తానికే నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. మంత్రి పదవితో జిల్లా కాంగ్రెస్ పార్టీకి జరిగే మేలు కంటే.. నష్టమే ఎక్కువని పార్టీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఒకరికి పదవి ఇచ్చి, మరొకరికి ఇవ్వకపోతే ఇద్దరి మధ్య తాము నలిగిపోవాల్సి వస్తుందని భయపడిపోతున్నారు.

# అవినీతిపై మాట్లాడితే అట్రాసిటీ కేసులా?

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



గుడ్లబోరి గ్రామంలో ఎండ్ల బండ్ల పందేలను ప్రారంభిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, మార్చి 27 : అవినీతి అక్రమాలపై మాట్లాడితే అట్రాసిటీ కేసులు పెట్టడం దారుణమని, ఇది ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్గొండ జిల్లాలోని నకిరేకల్‌లో పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై మాట్లాడిన కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం సరికాదన్నారు. పదో తరగతి విద్యార్థిని బెదిరించి పేపర్ ఫొటోలు తీసి వాట్సాప్‌లో వైరల్ చేశారని, దీనికి విద్యార్థిని డిబార్ చేయడమేమిటని ప్రశ్నించారు. గిరిజనులు, దళితులను అవమానపరుస్తూ మాట్లాడిన కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు, సీఎంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ దవాఖానలు లేక.. సకాలంలో వైద్యం అందక బుధవారం కౌటాల మండలానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడని, పట్టణంలోని ఈఎస్ఐ దవాఖానలో వైద్యం అందని ద్రాక్షగా మారిందని చెప్పుకొచ్చారు. వైద్య వృత్తిలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు సైతం ప్రభుత్వ దవాఖానలను పట్టించుకోవడం లేదన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో పాత పోలీసు స్టేషన్ స్థలంలో రెండొంతస్తుల భవనం నిర్మాణం జరుగుతుంటే అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదులు అందితే తూతూమంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పోడు రైతులకు అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయకూడదని, సిర్పూర్ నియోజకవర్గంలోని 9 లిఫ్ట్ ఇరిగేషన్‌లు మరమ్మతు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, మాజీ కౌన్సిలర్ మిన్‌హాజ్, నాయకులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

కౌటాల, మార్చి 27 : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం తాటిపల్లి గ్రామానికి చెందిన దాదాపు 20 మంది వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా, ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, ప్రస్తుత ప్రభుత్వ పుణ్యమాని అన్ని వర్గాల ప్రజలు కష్టాలు పడుతున్నారని చెప్పారు. గురుడుపేట గ్రామానికి చెందిన ఎలకుచ్చుల తిరుపతి అనే యువకుడు వైద్యం వికటించి మృతి చెందగా, ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. అనంతరం గుడ్లబోరి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎడ్లబండ్ల పందేల పోటీలను ప్రారంభించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యారావు, బీఆర్ఎస్ నాయకులు బండు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాలుగు గంటలు నరకయాతన..

- సోమగూడెం ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ
- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్
- తీవ్రంగా శ్రమించి రక్షించిన పోలీస్, 108, ఫైర్ సిబ్బంది



లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న గుర్జిత్ సింగ్‌ను బయటకు తీసుకువస్తున్న సిబ్బంది

కాసిపేట, మార్చి 27 : ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టగా, ఓ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి నాలుగు గంటలపాటు నరకయాతన అనుభవించాడు. ఈ ఘటన కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గురువారం తెల్లవారుజామున జరిగింది. సోమగూడెం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఓ ఇనుము లోడ్‌తో ఉన్న లారీ ఆగింది. మధ్యప్రదేశ్ నుంచి బెంగళూర్ వైపునకు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న మరో లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. అందులో (ఢీకొట్టిన లారీ) ఉన్న డ్రైవర్ గుర్జిత్ సింగ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారమందుకున్న కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పెట్రోకార్ ఏఎస్ఐ బూర రవీందర్, బ్లూకోల్ట్స్ పీసీ సాజన్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మంటలు చెలరేగకుండా ముందుగా ఫైర్ ఇంజిన్‌తో నీళ్లు చల్లారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌కు ఆక్సిజన్, ఫ్లూయిడ్స్ అందించి చికిత్స చేశారు. క్యాబిన్‌లో కాళ్లు విగిరి నాలుగు గంటల(ఉదయం ఐదింటి నుంచి ఉదయం తొమ్మి దింటి వరకు) పాటు డ్రైవర్ నరకయాతన పడ్డాడు. పోలీసులు, 108, ఫైర్ సిబ్బంది డ్రైవర్‌కు ధైర్యం చెప్పకుంటూ అతి కష్టం మీద బయటకు తీశారు. ఆపై 108లో మంచిర్యాలలోని దవాఖానకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింది నుంచి వాహనాలను మళ్లించారు. డ్రైవర్‌ను కాపాడేందుకు కృషి చేసిన కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పెట్రో కార్ ఏఎస్ఐ బూర రవీందర్, బ్లూకోల్ట్స్ పీసీ సాజన్, హోంగార్డ్ సత్తన్న, 108 సిబ్బంది సంపత్, తిరుపతి, కొమురయ్య, రవి, ఫైర్ సిబ్బంది, నేషనల్ హైవే సిబ్బందిని స్థానికులు అభినందించారు.

వెంకట్రావ్‌పేట పీహెచ్‌సీలో డాక్టర్ లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీ



డాక్టర్ లేక వచ్చిన పేషంట్లకు మందులు ఇస్తున్న సిబ్బంది





డాక్టర్ లేరని ఫొటో తీయడంతో వైద్యుడికి ఫోన్ చేసి చెబుతున్న సిబ్బంది

# డాక్టర్ సారు.. సమయానికి రారు..?

**లక్షెట్టిపేట మండలం** వెంకట్రావ్‌పేట్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యుడు, సిబ్బంది ఎవరూ సమయానికి రావడం లేదు. ఈ మేరకు గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో గురువారం వెంకట్రావ్‌పేట్ పీహెచ్‌సీని 'నమస్తే తెలంగాణ' సందర్శించింది. ఈ క్రమంలో ఉదయం 9 గంటలకు విధులకు రావాల్సిన వైద్యుడు ఉదయం 10.30 గంటలైనా రాలేదు. చూసీచూసి వైద్యుడి కుర్చీ ఖాళీగా ఉన్న ఫొటోలు తీసుకోగానే.. అక్కడున్న సిబ్బంది వెంటనే డాక్టర్ సార్‌కు ఫోన్ చేశారు. డాక్టర్ గుళ్లకోట గ్రామానికి సర్వేకు వెళ్లారని చెప్పారు. అక్కడి నుంచి ఉదయం 11 గంటలకు డాక్టర్‌ను కలిసేందుకు గుళ్లకోటకు వెళ్తే.. అక్కడా సార్ దొరకలేదు. వాస్తవానికి సార్ అసలు డ్యూటీకి వచ్చారా లేదా.. అని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆరా తీయగా.. డాక్టర్లు వెళ్లి పాల్గొనే సర్వేలు ప్రస్తుతం జిల్లాలో చేయడం లేదన్నారు. కుష్టువ్యాధికి సంబంధించిన సర్వే ఏఎన్ఎంలు చేస్తున్నారని.. ఆ సర్వేలకు డాక్టర్లు వెళ్లాల్సిన పని లేదని చెప్పారు. దీంతో డాక్టర్ సమయానికి రాకుండా సాకులు చెప్పారనే విషయం స్పష్టమైంది. సమయానికి విధులకు రాకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యుడిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

**- మంచిర్యాల, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్**